సాక్షి
చిత్తూరు
సోమవారం । 24 । మార్చి । 2025



కనిపించని సౌర వెలుగులు

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన సూర్యఘర్ పథకానికి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. - 8లో



గంగ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

పుంగనూరులోని శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
చిత్తూరు	6-29	4-54
పుంగనూరు	6-31	4-57

న్యూస్‌రీల్

ఇఫ్తార్ నిర్వహణకు రూ.4.35 లక్షల విరాళం

- పెద్దిరెడ్డి కుటుంబం ఔదార్యం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు : రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో ముస్లింల పట్ల పెద్దిరెడ్డి కుటుంబం తమ ఔదార్యాన్ని చాటుకుంది. పట్టణంలోని 29 మసీదుల్లో ఇఫ్తార్ నిర్వహణకు పెద్దిరెడ్డి కుటుంబం తరఫున తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి రూ.4.35 లక్షల విరాళాన్ని ముస్లిం పెద్దలకు ఆదివారం అందజేశారు. ఏటా ముస్లింలకు విరాళం అందజేయడం తమ కుటుంబం సంప్రదాయమని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలువురు మసీదు పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్క రోజులో బిల్లుల చెల్లింపు రూ.1.14.కోట్లు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ బిల్లులు చెల్లింపుల కేంద్రానికి ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ అందుబాటులో ఉంచారు. ఈ మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నందు సేవలను వినియోగదారులు వాడుకున్నారు. రెండు జిల్లాల పరంగా మొత్తం10 వేల 200 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించగా తద్వారా రూ.1.14 కోట్లు వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు వివరించారు.

ఒకే ఈతలో మూడు దూడలు



ఆరోగ్యంగా ఉన్న లేగ దూడ

ఐరాల : మండలంలోని యదర్లపల్లెలో ఆదివారం రైతు వినోద్‌కు చెందిన ఆవు ఒకే ఈతలో మూడు కోడె దూడలను ఈనింది. వీటిని చూసేందుకు స్థానిక, సమీప గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు. అయితే కొద్దిసేపటికి రెండు దూడలు మృతి చెందాయి. ఒక దూడ ఆరోగ్యంగా ఉందని రైతు తెలిపారు. ఇలాంటి సంఘటనలు జన్యుపరమైన లోపంతో జరుగుతుంటాయని పశువైద్యశాఖ ఏడీ పద్మావతి తెలిపారు. ఇవి బతకపోవడానికి రెండు కారణాలు ఉంటాయని, బలహీనంగా ఉండడం, చేతులతో గట్టిగా లాగడం చేస్తే దూడలు చనిపోతాయని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంల నిరసన

ఉదాసీనంగా ఉద్యోగోన్నతులు!

ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల జాబితాలో గందరగోళం నెలకొంది. ర్యాంకు ఆధారంగా ఫైనల్ జాబితా సిద్ధం చేశారంటూ ఆందోళన మొదలైంది. డేట్ ఆఫ్ జాయినింగ్ పక్కన పెట్టారని, జాబితా తయారీలో అన్యాయం జరిగిందంటూ పలువురు ఏఎన్ఎంలు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగోన్నతుల కోసం తప్పుడు పత్రాలు సమర్పించారని, సిఫార్సులకు పెద్దపీట వేశారని, ఎస్టీ కేటగిరికి జనరల్‌లో అన్యాయం జరిగిందంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

- వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం
- 2 రోజుల్లో ఏఎన్ఎంల పదోన్నతుల జాబితా ప్రకటన?
- ర్యాంకు ఆధారంగా ఫైనల్ లిస్టు సిద్ధం
- డేట్ ఆఫ్ జాయినింగ్‌ను పక్కన పెట్టిన వైనం
- జాబితా తయారీలో అన్యాయంపై ఏఎన్ఎంల ఆందోళన
- తప్పుడు పత్రాలు ఉన్నాయంటూ ఆరోపణలు
- ఎస్టీలకు జనరల్ కేటగిరీలో అన్యాయం
- కలెక్టర్‌కు ఫిర్యాదుల పరంపర

కాణిపాకం : సచివాలయ వ్యవస్థ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,069 మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. ఫస్ట్ ఏఎన్ఎంలుగా 247 మంది, సెకండ్ ఏఎన్ఎంలుగా 644 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా కొన్నేళ్లుగా సెకండ్ ఏఎన్ఎం, కాంట్రాక్టు ఏఎన్ఎంలుగా విధులు నిర్వర్తించడంతో 2019లో జరిగిన గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ పోస్టులకు కొందరు డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా 10 నుంచి 15 మార్కుల వెయిటేజీతో విధుల్లో చేరారు.

విడతల వారీగా చేరుతూ..

గ్రామ, వార్డు సచివాలయాలు 2019 అక్టోబర్ 2న ప్రారంభం కాగా, హెల్త్ సెక్రటరీలుగా సరైన రికార్డులతో విధుల్లో చేరాల్సి ఉంది. అందులో కొందరు అక్టోబర్ 14న కొంత మంది విధులకు రిపోర్టు చేశారు. మరికొంత మంది అక్టోబర్ 16 నుంచి డిసెంబరు నెలాఖరు వరకు విధుల్లో చేరుతూ వచ్చారు. జిల్లాలో మూడు విడతలుగా పోస్టింగ్ ఆర్డర్లు విడుదల చేయగా.. అభ్యర్థులు వారికి అనుకూలమైన తేదీల్లో జాయినింగ్ అయ్యారు. కొంత మంది అభ్యర్థుల సర్టిఫికెట్‌లు సక్రమంగా లేకపోవడం, పూర్తి స్థాయిలో సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ చేసి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో బోగస్ సర్టిఫికెట్లతో విధుల్లో చేరిన కొందరిని గుర్తించి, తిరిగి సర్టిఫికెట్లు పరిశీలించగా.. కొంత మంది సకాలంలో సమర్పించకపోవడంతో విధుల నుంచి తొలగించారు.

రూపకల్పన ఇలా..

గ్రేడ్-3 ఏఎన్ఎం నుంచి గ్రేడ్-2 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులకు గతేడాది ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 పోస్టులకు అర్హుల జాబితా తయారవుతోంది. అయితే ఈ జాబితా తయారీలో వైద్య ఆరోగ్య జిల్లా వైద్యాధికారుల తీరు ఏఎన్ఎంలలో అలజడి సృష్టిస్తోంది. కార్యాలయంలో ఇష్టారాజ్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు వారిని అయోమయంలో పడేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జాబితా తయారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ఎస్టీ కేటగిరికి 6 శాతం, ఎస్సీకి 15 శాతం రిజర్వేషన్ ప్రకారం చేశారు. అయితే జనరల్ కేటగిరిలో ఎస్టీ కేటగిరికి తీవ్ర అన్యాయం జరిగిందని గోలగోల చేస్తున్నారు. ఎస్టీ కులానికి చెందిన కొందరు ఏఎన్ఎంలకు మెరిట్ ఉన్న జనరల్ కేటగిరిలో వారిని పక్కన పెట్టేశారని, వికలాంగులను పట్టించుకోలేదనే వాదనలు ఉన్నాయి. సిఫార్సులకు తలొగ్గినట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్నింటికి బేరసాలు జరిగినట్లు, కలెక్టర్ బంగ్లాకు సమీపంలోని ఓ కేఫ్‌లో బేరసాలు జరిగినట్లు కొందరు ఆరోపిస్తున్నారు.

తప్పులు కప్పిపుచ్చే ప్రయత్నం

ఉద్యోగోన్నతుల జాబితా తయారీలో పలు ఆరోపణలు వస్తున్నా వాటిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పూర్తిగా పట్టించుకోవడంలేదు. ఏఎన్ఎంలు పలు సమస్యలు తీసుకొస్తున్నా వాటిని లెక్క చేయకుండా ప్రభుత్వ విధి విధానాల పేరుతో తప్పించుకుంటున్నారు. జాబితాలో తప్పులు ఉన్న వాటిని కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రశ్నించిన జాబితా విషయంలో దొరక్కుండా సమాధానం ఇవ్వాలని హుకుం జారీ అయినట్లు సమాచారం.

స్పష్టత లేని జాబితా

గ్రేడ్-3 ఏఎన్ఎంలు 1069 మంది ఉన్నారు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఇటీవల విడుదల చేసిన మెరిట్ లిస్టులో 307 మంది పేర్లను ప్రకటించారు. ఇందులో 297 మందికే పదోన్నతులు ఉంటాయని చెప్పడంపై గందరగోళంగా మారింది. దీనిపై అనుమానం రావడంతో తమకు అన్యాయం జరిగిందంటూ కొంత మంది కలెక్టర్‌ను కలిసి విన్నవించార. ఈ మేరకు మరో 5 పోస్టులు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శాఖ కమిషనర్‌కు నివేదికలు సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ 5 మంది పేర్లను జాబితాలో చేర్చారని తెలిసింది. మళ్లీ కొంత మంది కలెక్టర్‌ను కలిసి పదోన్నతుల జాబితాలో జరిగిన తప్పులను ఎత్తి చూపిస్తున్నారు. ఇష్టానుసారంగా జాబితాను తయారు చేయడంపై మండిపడుతున్నారు. ఇలానే కొనసాగితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా ఏఎన్ఎంల వివరాలు..

సచివాలయ ఏఎన్ఎంలు -	1069
ఫస్ట్ ఏఎన్ఎంలు -	247
సెకండ్ ఏఎన్ఎంలు -	644
పదోన్నతుల జాబితా -	307
ఎస్టీల రిజర్వేషన్ -	6 శాతం
ఎస్సీల రిజర్వేషన్ -	15

ఆర్డర్ మేరకు ఇవ్వాలి..



వైద్య ఆరోగ్యశాఖలో ర్యాంకు ప్రకారమే పదోన్నతులు చేస్తామని చెబుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశాం. కలెక్టర్ అపాయింట్ ఆర్డర్ ప్రకారమే చేస్తామని హామీ ఇచ్చారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ర్యాంకు ప్రకారమే చేస్తామని చెబుతున్నారు. అప్పుడు మూడు బ్యాచ్‌లుగా తీసుకున్నారు. ఇప్పుడు ఫస్ట్ బ్యాచ్‌కు పదోన్నతుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. - గీత, ఏఎన్ఎం

కలెక్టర్ చెప్పినా పట్టించుకోవడం లేదు..



మమల్ని ఫస్ట్ బ్యాచ్‌లో తీసుకున్నారు. అయితే ఫస్ట్ బ్యాచ్‌ను పక్కన పెట్టి..ర్యాంకు ఆధారంగా చేసుకుంటున్నారు. దీనిపై మాకు అనుమానాలున్నాయి. ఉద్యోగోన్నతుల కోసం దొంగ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇలా చేస్తే ఫస్ట్ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంల, వయస్సు మళ్లిన వారి పరిస్థితి ఏంటి? ఈ విషయంపై కలెక్టర్ చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. ఫస్ట్ బ్యాచ్‌కు పదోన్నతులు కల్పించాలి . - క్రిష్ణమ్మ, ఏఎన్ఎం

పారదర్శకంగా చేపడుతాం



ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా చేస్తున్నాం. కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం. 307 మందితో మెరిట్ లిస్ట్ ఇచ్చాం. ఆ 307 మందికి పదోన్నతులు ఉండవు. 297 మందికే ఉంటాయి. జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే..అందుకు అదనంగా కొంత మందిని లిస్టులో పెట్టాం. మరో 5 మందిని జాబితాలోకి తీసుకోలేదు. ఇంకా జాబితా పూర్తి కాలేదు.

- సుధారాణి, డీఎంఅండ్‌హెచ్ఓ, చిత్తూరు

మానవాళి సంక్షేమానికే సైకిల్ యాత్ర



నగరి: మానవాళి సంక్షేమాన్ని కోరుతూ సైకిల్ యాత్ర చేపట్టినట్లు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం శ్రీపతిరావుపేటలోని సంజీవరాయ ఆంజనేయస్వామి ప్రధాన అర్చకులు కాశ్యపు అశోకయ్యస్వామి తెలిపారు. ఆయన ఈ నెల 19న ఆత్మకూరు నుంచి తమిళనాడులోని ఘటికాచలం వరకు 450 కిలోమీటర్ల సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఆదివారం నగరి పట్టణ పరిధిలోని నెత్తంకండ్రిగకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల, ఆళ్లగడ్డ, మైదుకూరు, కడప, రేణిగుంట, తిరుపత్తణి మీదుగా ఘటికాచలం చేరుకోనున్నట్లు తెలిపారు. గతంలోనూ ఆత్మకూరు నుంచి పండరీపురం, శ్రీకోయిలూరు మీదుగా మంత్రాలయానికి సైకిల్ యాత్ర చేసినట్టు తెలిపారు.

నేడు ప్రపంచ టీబీ దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద దేవర్లు



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

గుడుపల్లె : మండలంలోని జోగ్యానూరులోని సిద్ధేశ్వరస్వామి, బీరేశ్వర స్వామి ఆలయాల్లో కురబ కులస్తులు పెద్ద దేవర్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామంలోని ఆలయ ఆవరణలో కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాల్లోని 300 మంది కురబ కులస్తులు పెద్ద దేవర సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన కురబ కుటుంబాల వారు ఒకరోజు రాత్రి అక్కడే బస చేసి ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సంప్రదాయబద్ధంగా దేవర ఎద్దుకు ప్రత్యేక పూజలు చేశారు.ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో తలపై టెంకాయలు కొట్టే కార్యక్రమం చేపట్టారు. రాత్రి భక్తుల వినోదం కోసం కోలాటలు, పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు.

దమ్ముంటే పట్టుకో..

- యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా
- రూ. కోట్లు కొల్లగొడుతున్న నేతలు
- రెచ్చిపోతున్న పచ్చ మాఫియా
- చేష్టలుడిగి చూస్తున్న అధికారులు



శ్రీరంగరాజపురం : పాతపాళెం వద్ద మట్టిని తరలించడంతో మైదానంలా మారిన కొండ

వెదురుకుప్పం : సమయం లేదు మిత్రమా.. అందిన కాడికి దోచేద్దాం.. ఎవరైనా అడ్డొస్తే వాళ్ల సంగతి తేల్చేద్దాం.. అధికారులు మాట వినకపోతే వేటు వేద్దాం.. ఇదీ కూటమి ప్రభుత్వంలో బరి తెగిస్తున్న పచ్చనేతల తీరు. అక్రమాలను అడ్డుకుంటున్న అధికారులపై ప్రలోభాలు, బెదిరింపులు.. ప్రత్యక్ష, పరోక్ష దాడులతో హడలిపోతున్నారు. నిక్కచ్చిగా విధులు నిర్వహించాలంటే ఇక్కడ సాధ్యమయ్యే పనికాదు.. నేతలు చెప్పిందల్లా చేస్తే సరి.. ఎదురు తిరిగితే.. పోస్టింగ్ కోసం ఎదురు చూడక తప్పని పరిస్థితులు కల్పిస్తున్నారు. పుష్ప సినిమాను తలదన్నేలా నిర్విరామంగా సాగుతున్న సిండికేట్ దందాలు అన్నీ ఇన్నీ కావు. జిల్లాలో చోటా నాయకుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ అడ్డూ అదుపూ లేకుండా చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు హద్దు లేకుండా పోతోంది. ఇసుక, మట్టి ఉన్న ప్రాంతాల్లో పాగా వేసి అక్రమ సామ్రాజ్యాన్ని నెలకొల్పి భారీ దోపిడీ చేస్తున్నారు.

ఆదాయ వనరులుగా ఇసుక, గ్రావెల్

చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ కూటమి నాయకులు చేస్తున్న దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఇసుక, గ్రావెల్ దోపిడీ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ప్రధానంగా ఇసుక, మట్టిని విచ్చలవిడిగా తోడేస్తున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక, మట్టి అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. ప్రజాప్రతినిధుల అండ దండలతో రూ. కోట్లు ఆర్జిస్తున్నారు. పట్టపగలే గ్రావెల్‌తో పాటు ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నా అధికారులు చేతులు ముడుచుకుని చేసేది లేక మిన్నుకుండి పోతున్నారు. జిల్లా నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో ఒక పక్క ఇసుక మరో పక్క గ్రావెల్‌ను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి రూ. కోట్లు దండుకుంటున్నారు.

అక్రమార్కులకు అడ్డాగా..

జీడీ నెల్లూరు అక్రమార్కులకు అడ్డాగా మారింది. అధికారుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న తీరు చూస్తే విస్తుపోవాల్సిందే. సహజ సిద్ధంగా ఏర్పడిన మట్టి, ఇసుక కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. కొండలు కనిపిస్తే చాలు ఠంచనుగా నాయకులు వాలిపోయి జేసీబీలతో తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కుల దనార్జనకు కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ కూటమి నేతలు ఇలా మట్టి, ఇసుక దోపిడీ చేస్తూ రూ. కోట్లు గడిస్తున్నారన్నదే ప్రజలందరికీ తెలిసిన బహిరంగ సత్యం. తమిళనాడుకు సరిహద్దు ప్రాంతమైన గంగాధర నెల్లూరు నియోజకవర్గం పచ్చ మాఫియాకు అనుకూలంగా మారింది. ప్రధానంగా పాలసముద్రం, గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల్లో నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

పెద్ద ఎత్తున దందాలు

క్వారీ యజమానుల వద్ద నుంచి స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి వసూళ్లకు తెగపడుతున్నారు. ఆరు మండలాల్లోనూ పీఏలను నియమించిన ఓ ప్రజాప్రతినిధి ఆయా మండలాల్లో ఎన్ని క్వారీలు ఉన్నాయనే వివరాలను అధికారుల వద్ద నుంచి సేకరించి దందాలకు పాల్పడుతున్నారు. నేను ప్రజాప్రతినిధి పీఏని మామూళ్లు ఇస్తావా వాహనాలు సీజ్ చేయమంటావా అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకుని క్వారీలను నడుపుతున్నా ఏదో ఒక సాకు చెప్పి నిలిపివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మామూళ్లు ఇచ్చుకుంటేనే సరి లేకుంటే దౌర్జన్యాలు, బెదిరింపులకు దిగుతున్నట్లు చెబుతున్నారు. గతంలో ఇలాంటి దోపిడీలు లేవని, ఈ దోపిడీ విషయంలో గత ప్రభుత్వం ఎన్నో రెట్లు మేలని చెప్పుకుంటుండడం విశేషం.

అక్రమాలు ఇలా..

- గంగాధర నెల్లూరు మండలంలోని ముక్కలత్తూరు, కొట్రకోన, పాతపాళెం ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ముక్కలత్తూరులో నీవా నది నుంచి చెన్నైకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడ పచ్చ బ్యాచ్ ఇసుకను డంప్ చేసి రాత్రికి రాత్రే ట్రాక్టర్ల ద్వారా తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ నుంచి వెళ్లే ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి ఉండవని చెబుతున్నారు.
- పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం, సింహరాజపురం, బలిజకండ్రిగ, మటవలం గ్రామాల్లో ఇసుక డంప్ చేసి రాత్రికి రాత్రే టిప్పర్లు, ట్రాక్టర్లలో కూటమి నేతలు తరలిస్తున్నారు. ఒక టిప్పర్ రూ. 25 వేలు పలుకుతోంది.



కార్వేటినగరం మండలంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న మట్టి

- వెదురు కుప్పం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం ప్రాంతాల నుంచి మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి పూట జేసీబీల నుంచి గుట్టలను తవ్వి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు.
- శ్రీరంగరాజపురం మండలంలో కూటమి నేతలు విచ్చలవిడిగా మట్టిని విక్రయించి దోచుకుంటున్నారు. ఇక్కడ కూటమి నేతలు చెప్పినట్టే అధికారులు తలలు ఊపుతున్నారు. గ్రావెల్ కోసం పచ్చని గుట్టలను మాయం చేస్తున్నారు. పాతపాళ్యం వద్ద ఉన్న కొండను తవ్వి సొమ్ము చేసుకున్నారు. తర్చూరు హైవే రోడ్డు పనుల నిమిత్తం మట్టిని తరలించే క్రమంలో దాన్ని సాకుగా చూపి పెద్ద ఎత్తున గ్రావెల్ తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.
- కార్వేటినగరం మండలంలో గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేదు. ప్రజాప్రతినిధి సొంత మండలం కావడంతో ఇసుకను డంప్ చేసుకుని రవాణా చేస్తున్నారు. ఇక్కడ టీడీపీ, జనసేన పార్టీలు పోటా పోటీగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉచిత నైపుణ్య శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ఆధ్వర్యంలో సీడాప్ సౌజన్యంతో ఉచిత నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాల వ్యవధిలో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ శిక్షణలో కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఇంటర్, డిగ్రీ, సైన్స్ బ్యాక్ గ్రౌండ్ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్‌కు ఇంటర్ ఉత్తీర్ణత, బ్యూటీ థెరపీ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు ఈ శిక్షణ కోర్సులకు అర్హులు అని తెలిపారు. అదనంగా బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90630 82227, 99664 48807 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

కనిపించే దేవత అమ్మ

- ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు
- ఘనంగా పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలు



పండితులకు నగదు పురస్కారాలతో పాటు, జ్ఞాపికలను అందించిన నిర్వాహకులు

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం) : తల్లికి మించిన దైవం ఏదీ లేదని.. కనిపించే దైవం అమ్మ అని ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు అన్నారు. ఆదివారం ఆరిమాకులపల్లె తెలుగుతల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. తల్లిని పూజించగలిగిన వారే భార్యను ప్రేమించగలడని అన్నారు. అనంతరం శతావధాని ఆముదాల మురళీ మాట్లాడుతూ.. సమాజాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడానికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కథల పోటీలలో గెలుపొందిన రోహిణి వంజారి (హైదరాబాద్), డాక్టర్ సుగుణారావు (విశాఖపట్టణం), ఓట్ర ప్రకాశరావు (తిరుత్తణి), నర్సిరెడ్డి (అనంతపురం), అరుణకుమారి (చిత్తూరు), సీతారామరాజు (కాకినాడ), డాక్టర్ కోటేశ్వరరావు (కరీంనగర్), సింహ ప్రసాద్ (హైదరాబాద్), విమల (చిత్తూరు), సారిపల్లి నారాయణ (హైదరాబాద్), మౌనిక (తిరుపతి) నగదు బహుమతులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష ,కార్యదర్శులు పైనేని తులసీనాథం నాయుడు, పుష్ప, కోశాధికారి పైనేని మురళీ, జొన్నవత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆనందబాబు, నరేంద్ర, యుగంధర్, విజయేంద్రనాయుడు, కాంతమ్మ, రమ్య, రేణుక, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీఓల బదిలీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గంలో నలుగురు ఏపీఓలు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఉపాధి పనుల్లో యథేచ్ఛగా జరిగిన అవినీతి ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల్లో బట్టబయలైన విషయం విధితమే. ఈ క్రమంలోనే ఏపీఓలపై కలెక్టర్ వెంకటేశ్వర్ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. శనివారం ఈ మేరకు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వడమాల పేటలో ఏపీఓ సునీతను రామచంద్రాపురానికి, ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో హంసవేణిని వడమాలపేటకు బదిలీ చేశారు. అలాగే రేణిగుంట నుంచి జ్యోతిశ్రీని తిరుపతి రూరల్ మండలానికి, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న మమతను పుత్తూరుకు బదిలీ చేశారు. పుత్తూరు నుంచి భార్గవిని చంద్రగిరికి, ఇక్కడ పనిచేస్తున్న జ్యోతిని బాలాయపల్లికి, అక్కడి నుంచి ఆషారాణిని పాకాలకు, పాకాలలో విధులు నిర్వర్తిస్తున్న కల్యాణిని తొట్టంబేడు మండలానికి బదిలీ చేశారు. అయితే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు ఏపీఓలను బదిలీ నుంచి మినహాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద అత్యధికంగా పనులు జరిగిన ఆ రెండు మండలాల్లో అవినీతి వెలుగుచూసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏపీజీహెచ్ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,428 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,920 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

కనిపించని సౌర వెలుగులు

- సూర్యఘర్ పథకంపై నిరాసక్తత
- రాయితీ ఉన్నా వినియోగించుకోని వైనం
- జిల్లాలో దరఖాస్తులు 5 వేలు
- 250 యూనిట్లే ఏర్పాటు



చిత్తూరులో ఏర్పాటు చేసిన సోలార్ పలకాలు

చిత్తూరు కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. సౌర ఫలకాల ఏర్పాటు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మార్చి నాటికి జిల్లాలో సుమారు 6 వేల యూనిట్లను ఏర్పాటు చేయించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 5 వేల మంది దరఖాస్తు చేయగా, 288 మంది మాత్రమే డబ్బులు చెల్లించారు. వీరిలో 250 మంది ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇందులో చిత్తూరు డివిజన్‌లోనే 146కు పైగా ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ సరఫరాను దృష్టిలో పెట్టుకొని సోలార్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సొంత ఇంటి పై సౌర పలకాలు ఏర్పాటుతో సొంతంగా విద్యుత్ ఉత్పత్తిని చేసుకోవచ్చు. మిగులు విద్యుత్‌ను శాఖా పరంగా కొనుగోలు చేసి బిల్లులో సర్దుబాటు చేయనున్నారు. ఒకేసారి పెట్టుబడి పెడితే కరెంటు బిల్లు జోలికి పోవాల్సిన అవసరం ఉండదు.

ఆసక్తి చూపని జిల్లావాసులు

సౌర విద్యుత్‌కు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. బ్యాంకు రుణాలకు బ్యాంకర్లు మొండిచేయి చూపడంతో వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా వీటిని ఏర్పాటు చేస్తుండటంతో.. భవిష్యత్తులో అందరికీ ఇలా పెడతారనే నమ్మకంతో కొంత మంది ఉన్నారు. దీనికి తోడు కుప్పం నియోజకవర్గం మొత్తం పైలట్ ప్రాజెక్టుగా అందరికీ అందించనున్నారు. పెట్టుబడి లేకుండా సోలార్ పలకాలను ఏర్పాటు చేయనున్నారు. యూనిట్ వ్యయం రికవరీ అయ్యే వరకు విలువ మొత్తంను మిగులు విద్యుత్‌లో మినహాయించుకోనున్నారు. ఈ విధానం విజయవంతం అయితే కొన్ని సంవత్సరాల తర్వాత జిల్లా అంతటా పెడతారని భావిస్తున్నారు. డీలర్లు అయిదేళ్ల పాటు ఉచిత సర్వీసు అందిస్తున్నారు. ఈ పథకంను కేంద్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో అందుబాటులోకి తెచ్చింది. సౌర విద్యుత్ ప్యానళ్లు, ఇతర సామగ్రికి అయ్యే వ్యయంలో కొంత మొత్తం ప్రభుత్వం రాయితీ అందజేస్తోంది.

ఆదాయం పొందవచ్చు

మొత్తం విద్యుత్ వినియోగం ఆధారంగా 120 యూనిట్లలోపు ఉన్న వారికి 1 కిలోవాట్ అవసరమవుతుంది. దీనికి రూ.30,000 రాయితీని అందిస్తున్నారు. 240 యూనిట్లు నెలకు వాడుకునే వారికి 2 కిలోవాట్లు అవసరం కాగా రూ.60,000 రాయితీ ఇస్తున్నారు. 360 యూనిట్లు వినియోగిస్తున్న వారికి 3 కిలోవాట్లు అవసరమవుతుంది. వీటికి రూ.78,000 రాయితీ ఇస్తున్నారు. దాదాపు రూ.2 లక్షలు విలువైన 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల రాయితీ కల్పించింది. రూ.20 వేలు లబ్ధిదారుడి వాటాపోనూ మిగిలిన మొత్తానికి 7 శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం పొందవచ్చు. ఈ వ్యవస్థ ద్వారా ఏడాదికి దాదాపు రూ.32 వేలు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వినియోగించుకున్న మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందవచ్చు. రుణం పొందేందుకు బ్యాంకులకు సెక్యూరిటీ కింద ఎటువంటి డాక్యుమెంటులు సమర్పించాల్సిన అవసరం లేదు.

> **అపోహలు వద్దు**
>
> సోలార్ పవర్ వల్ల విద్యుత్ బిల్లు భారీగా తగ్గుతుంది. మొదట పెట్టుబడి ఎక్కువగా అనిపించినప్పటికీ భవిష్యత్తులో ఊహించని ప్రయోజనం చేకూరుతుంది. సోలార్ రూఫ్ టాప్ విషయంలో ఎటువంటి అపోహలు అవసరం లేదు. బ్యాంకులు రుణంగా ఇస్తాయి. బ్యాంకు అప్పు తీరిపోతే 15 సంవత్సరాల పాటు ఇంటికి ఉచితంగా విద్యుత్ పొందడంతో పాటు మరికొంత సొమ్ము ఎస్పీడీసీఎల్ నుంచి వస్తుంది. – ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో

అపరిచితుడు !

- ఆ అధికారి వింత చేష్టలు
- అనుమానం వస్తే తప్పని వేధింపులు
- చిత్తూరోళ్లంటే గిట్టని వైనం
- కార్యాలయంలో అనధికారిక డెప్యూటేషన్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఓ అధికారి తీరుతో శాఖ అధికారులు, సిబ్బంది బేజారవుతున్నారు. ప్రతి దానికి అందరిపై అనుమానం పడుతున్నారని తలలు పట్టుకుంటున్నారు. కార్యాలయంలో జరిగే విషయాలు బయటకు, పత్రికలకు ఎలా తెలుస్తున్నాయని ఆ అధికారి తిట్ల పురాణం మొదలు పెడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇకపై విషయాలు బయటికొస్తే ఎవరిని వదిలిపెట్టను..సస్పెండ్ చేస్తానని ఆ అధికారి హెచ్చరికలు జారీ చేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్తూరోళ్లు అంతా ఇలానే ఉంటారంటూ బహిరంగా చెప్పడంపై పలువురు విస్తుపోతున్నారు. విలేకరులతో ఎవరెవ్వరూ మాట్లాడుతున్నారో గుచ్చి గుచ్చి అడుగుతున్నారని, అలా అనుమానం ఉన్న వాళ్లపై నిఘా పెట్టి వేధిస్తున్నారని కంటతడి పెడుతున్నారు. ఈ తరుణంలో 20 మంది వరకు సీట్లు మార్చారని పలువురు కోడైకూస్తున్నారు. ఇందులో అటెండర్ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఉన్నారని చెబుతున్నారు. కార్యాలయంలోని అందరూ తన వర్గానికి అనుకూలంగా ఉండాలని కొంత మందిని అనధికారికంగా డెప్యూటేషన్‌పై తీసుకొచ్చారని అంటున్నారు. డెప్యూటేషన్‌లను ప్రభుత్వం రద్దు చేసినా...ప్రత్యేకంగా డెప్యూటేషన్లు ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వర్క్ ఆర్డర్ సాకు చూపి ఇలా చేయడం దారుణమని పలువురు మండిపడుతున్నారు. ఇంట్లో సమస్యలు, ఈ వేధింపులు పడకలేక మాకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదని మహిళా ఉద్యోగులు ఆవేదనకు గురవుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించి కార్యాలయంలో అనుమానం పేరుతో ఇబ్బంది పడుతున్న అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూడాలని కార్యాలయ అధికారులు, సిబ్బంది వేడుకుంటున్నారు.

కళాశాల వేడుకలో వినూత్న నిరసన



కళాశాల వార్షికోత్సవంలో వైఎస్సార్‌సీపీ జెండాలతో హల్‌చల్ చేస్తున్న విద్యార్థులు

పలమనేరు : పలమనేరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాత్రి కళాశాల వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పలువురు విద్యార్థులు వైఎస్సార్‌సీపీ జెండాలతో నృత్యం చేస్తూ జగనన్న జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో ప్రజాప్రతినిధితో పాటు కళాశాల యాజమాన్యం సైతం ఖంగుతింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాటలు వేసి వినిపించినా విద్యార్థులు తామే తగ్గేదేలేదంటూ జగనన్న నినాదాలతో హోరెత్తించారు. జగన్నన విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా చేసిన కూటమి సర్కార్‌పై ఈ విధంగా విద్యార్థులు నిరసన తెలిపారు. దీంతో కళాశాల నిర్వాహకులు సైతం చేసేదీమీ లేకుండా పోయింది. కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ప్రజాప్రతినిధి సైతం మిన్నుకుండిపోవాల్సి వచ్చింది.

చంద్రగిరి 'కూటమి'లో విభేదాలు



బోసిబోయిన ర్యాలీలో జనసేన ఎమ్మెల్యేలు, నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో విభేదాలు మొదలయ్యాయి. ఆదివారం చంద్రగిరిలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నేతల నడుమ పొరపొచ్చాలు బహిర్గతమయ్యాయి. చంద్రగిరి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. ఈ మేరకు కూటమి ప్రజాప్రతినిధులు, నేతలను ఆహ్వానించారు. ఈ మేరకు పట్టణంలో కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

8 గంటలకు అని చెప్పినా..!

పార్టీ కార్యాలయాన్ని ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు జనసేన నేతలు తొలుత ప్రకటించారు. అయితే మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా టీడీపీ, బీజేపీ నాయకులు కనిపించకపోవడంతో జనసేన నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక చేసేది లేక తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి కొత్తపేటలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయం ప్రారంభించారు.

ఇంటికెళ్లి పిలిచినా..!

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలంటూ టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి జనసేన నేతలు ఆహ్వానించినట్లు సమాచారం. అయినప్పటికీ ఆయన ముఖం చాటేయడంపై జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

అడవికి నిప్పు ..రూ.కోట్లలో నష్టం

- కాలిన ఎర్ర చందనం, ఉసిరి, నేరేడు చెట్లు
- కనిపించని అటవీశాఖ అధికారులు



మర్రిపల్లి సమీపంలో అడవిలో ఎగిసి పడుతున్న మంటలు

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం) : గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టిన సంఘటన మండల పరిధిలోని మర్రిపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. మెదవాడ సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సుమారు లక్షల రూపాయలు వెచ్చించి వంద హెక్టార్లలో పెంచిన విలువైన ఎర్ర చందనం, నేరేడు, ఉసిరి చెట్లు దగ్ధమయ్యాయని వాటి విలువ రూ.కోట్లలో ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరిగినా కనీసం అటవీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం విమర్శలకు తావిస్తోంది. అడవి చుట్టూ అనేక గ్రామాలు ఉండడంతో మంటలు గ్రామాల వైపు వస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందనే ఆందోళనకు గురైనట్లు తెలిపారు.

దృఢ సంకల్పమే విజయానికి ఆయుధం



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, ఈసీఈ విభాగం అధ్యాపకులు

– ఎస్వీయూలో ఘనంగా సిగ్మాండ్–2025 ఫెస్ట్

తిరుపతి సిటీ : దృఢ సంకల్పం ఉంటే జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవచ్చని, దృఢ సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలని ఎస్వీయూ పూర్వ విద్యార్థి, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సిగ్మండ్–2025 ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆయన వర్చువల్ విధానంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఎస్వీయూలో ఈసీఈ విభాగంలో 2012లో ఇంజినీరింగ్ పూర్తి చేశానని తెలిపారు. సివిల్స్ లక్ష్యంగా శ్రమించానని, పలు ప్రయత్నాల్లో విఫలమైనా ఆత్మ విశ్వాసాన్ని వదలలేదన్నారు. తర్వాత తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమన్నారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిపుణులైన అధ్యాపకులకు కొదవలేదన్నారు. వారి సూచనల మేరకు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

–ఐఏఎస్ అధికారి మాటలతో స్ఫూర్తి పొందిన విద్యార్థులు

తమ కళాశాలలో చదివి ఐఏఎస్‌గా ఎంపికైన రాహుల్ కుమార్‌రెడ్డి మాటలతో ఈసీఈ విభాగం విద్యార్థులు స్ఫూర్తి పొందారు. ఆయన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం ఇచ్చారు. సందేహాలను నివృత్తి చేశారు. విఫలం చెందామని నిరుత్సాహ పడకుండా ముందుకు సాగితే లక్ష్యం కాళ్ల వద్దకు చేరుతుందన్నారు. సివిల్స్ కష్టసాధ్యమైన పరీక్ష అంటూ సమాజంలో ఎంతో మంది వెనకడుగు వేస్తారని, అది సత్యదూరమన్నారు.

–ఎస్వీయూ విద్యార్థి ఐఏఎస్ సాధించడం గర్వకారణం

వీసీ అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయూ ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి రాహుల్ కుమార్‌రెడ్డి ఐఏఎస్ సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఈసీఈ విభాగం హెడ్ స్వర్ణలత, కన్వీనర్ ప్రొఫెసర్ వరదరాజన్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ రామ్ హర్షన్, వర్షిత, పలు కళాశాలల నుంచి సుమారు 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

– ఇద్దరికి తీవ్ర గాయాలు



బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్ చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నుంచి పలమనేరు వెళుతున్న లారీని మొగిలి ఘాట్ వద్ద ముందుపోతున్న ద్విచక్ర వాహనాన్ని అధిగమించే క్రమంలో మరో ద్విచక్రవాహనం లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన మనోజ్, చెన్నైకి చెందిన వేలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రయిస్తూ మహిళ అరెస్టు

చిత్తూరు అర్బన్ : నాటు సారా విక్రయిస్తున్న ఓ మహిళను ఆదివారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా... టూటౌన్ పోలీసులు చిత్తూరు నగరం తేనేబండ ప్రాంతంలో నాటు సారా విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గౌరీ (45) అనే మహిళ సారా విక్రయిస్తుండగా నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేస్తుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

గంగ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- రేపటి నుంచి జాతర ఉత్సవాలు
- 400 మంది పోలీసులతో బందోబస్తు
- పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ వెల్లడి



ప్యాలెస్‌లో జమీందారి కుటుంబీకులతో సమావేశమైన డీఎస్పీ



శ్రీసుగుటూరు గంగమ్మ

పుంగనూరు : ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శ్రీసుగుటూరు గంగమ్మ జాతరను పటిష్ఠంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నామని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సీఐలు, పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతర జరిగే ప్యాలెస్ ఆవరణం , ప్యాలెస్‌లో జమీందారులు సోమశేఖర్ చిక్కరాయల్, మల్లికార్జున చిక్కరాయల్‌తో సమావేశమై జాతర ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు , సిబ్బంది 400 మందిని జాతర బందోబస్తుకు నియమించామన్నారు. 25న మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపుతో ప్రారంభమై 26న బుధవారం వేకువజాము నుంచి అమ్మవారిని ప్రజల దర్శనార్థం ప్యాలెస్‌లో ఉంచుతారని తెలిపారు. అదే రోజు రాత్రి అమ్మవారి నిమజ్జనం ఉంటుందని తెలిపారు.

శాంతి కమిటీ ఏర్పాటు

జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. అనుమానితులు , జేబు దొంగలను ముందుగానే అదుపులోకి తీసుకునేలా ఐడీ పార్టీ బృందాలను నియమించామన్నారు. జాతరకు వేల మంది రానున్న కారణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని , ఇందుకోసం ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జాతరను జయప్రదం చేసేందుకు అన్ని వర్గాలతో కలిపి శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ భాస్కర్, సీఐలు రామ్‌భూపాల్, ఉమామహేశ్వర్‌రావు, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

> **ట్రాఫిక్ మళ్లింపు**
>
> పట్టణ సమీపంలోని అరబిక్ కళాశాల నుంచి బస్సులు, లారీలు , కార్లు బైపాస్‌రోడ్డు నుంచి చదళ్ల క్రాస్‌కు మళ్లిస్తున్నామన్నారు. అలాగే పట్టణంలోని సెంటర్‌లాడ్జి, తూర్పుమొగశాల, నగిరివీధి, బ్రాహ్మణవీధి, కట్ట కిందపాళ్యం ప్రాంతాలలో కార్లు , ద్విచక్ర వాహనాలు పూర్తిగా నిషేధిస్తామన్నారు. అత్యవసర సమయాల్లో అనుమతిస్తామన్నారు. పార్కింగ్ కోసం చెరువు కట్టపైన , ఆర్టీసీ డిపో , ఎస్ఎస్ పేట, బీఎంఎస్ క్లబ్ ప్రాంతాలలో స్థలం ఏర్పాటు చేశారు.